క్లుప్తంగా

చీరాల ఇన్‌చార్జి డీఎస్పీగా జగదీష్‌నాయక్

చీరాల: చీరాల ఇన్‌చార్జి డీఎస్పీగా జగదీష్‌నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా సీసీఎస్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆయన చీరాలకు ఇన్‌చార్జిగా వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఎస్పీగా బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ వ్యవహరించారు. బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ జగదీష్‌నాయక్‌ని పలువురు సీఐలు, ఎస్సైలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి


మాట్లాడుతున్న జిల్లా డీడీఏ విజయనిర్మల

మేదరమెట్ల: రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి భూసారం కాపాడుకోవాలని బాపట్ల జిల్లా డీప్యూటీ డైరెక్టర్ ఎం. విజయనిర్మల అన్నారు. శుక్రవారం ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకంపై మండలంలోని రైతులకు శిక్షణ నిర్వహించారు. సందర్భంగా డీడీఏ మాట్లాడుతూ రసాయనికి ఎరువులకు బదులు పచ్చిరొట్టపైర్లు పెంచి భూసారాన్ని పెంచాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడీఏ రత్నకుమారి, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డీజే రాధాకృష్ణ, బాలమురళీధరనాయక్, అద్దంకి ఏడీఏ ధన్‌రాజు, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

సొసైటీ షాపులను పరిశీలించిన ఆర్డీవో


స్థల పరిశీలన చేస్తున్న చీరాల ఆర్డీవో

అద్దంకి రూరల్: పట్టణ కార్పెంటర్ వెల్ఫేర్ సొసైటీ షాపుల కోసం కేటాయించిన స్థలాన్ని శుక్రవారం చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి పరిశీలించారు. కార్పెంటర్‌లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ నాయకులు కాకారి అశోక్, వడ్లపల్లి పూర్ణచంద్రరావు కార్పెంటర్ యూనియన్ ప్రెసిడెంట్ దాడి చెన్నకేశవులు, పొన్నపల్లి మల్లికార్జునరావు, ఏజెండ్ల ఆంజనేయులు, చెన్నుపల్లి కోటిలింగాచారి, ఆళ్లగడ్డ వీర సుందరాచారి పాల్గొన్నారు.

30 మందికి మెరిట్ స్కాలర్‌షిప్‌లు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ ప్రతినిధి

అద్దంకి రూరల్: విద్యోన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కాకానిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అద్దంకి, ఇంకొల్లు, పంగులూరు మండలాలకు చెందిన 30 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.3 లక్షలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గురవయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒంగోలు సమతానగర్‌లో చోరీ


దొంగలు పగులగొట్టిన బీరువా లాకర్

ఒంగోలు టౌన్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలుపడి దోచుకెళ్లిన సంఘటన ఒంగోలు సమతానగర్‌లో జరిగింది. స్థానిక గుప్తా స్కేర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పనిచేసే కొలసాని బాలకృష్ణ సమతానగర్ రెండో లైనులో తల్లితో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ నెల 10వ తేదీ బాలకృష్ణ తల్లి షిరిడీ యాత్రకు వెళ్లారు. 11వ తేదీ రాత్రి ఒక ఫంక్షన్‌కు వెళ్లిన బాలకృష్ణ.. మరుసటి రోజు శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటి ప్రధాన ద్వారం పగులకొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా బెడ్‌రూంలోని బీరువా లాకర్ పగులకొట్టి ఉంది. అందులోని బంగారం, కప్‌బోర్డులో దాచి ఉంచిన లక్షన్నర నగదును దొంగలు తీసుకెళ్లినట్లు తాలూకా పోలీసులకు బాలకృష్ణ ఫిర్యాదు చేశారు. సీఐ ఖాజావలి ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సాక్ష్యాలు సేకరించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు


గజ ఈతగాళ్లు

వాడరేవు బీచ్‌కి పర్యాటకులకు అనుమతి

- వరస మరణాలతో రెండు వారాలు పాటు బీచ్‌ల మూసి వేత
- రక్షణ చర్యలు చేపట్టిన పోలీసు యంత్రాంగం


సముద్రంలో ఏర్పాటు చేసిన ఎర్ర జెండాలు

చీరాల: ఎట్టకేలకు రెండు వారాల తర్వాత సముద్ర తీరాలకు పర్యాటకులను పోలీసులు అనుమతిచ్చారు. చీరాల, వేటపాలెం మండలాల పరిధిలోని వాడరేవు, రామాపురం, కఠారివారిపాలెం బీచ్‌లకు పర్యాటకులకు పోలీసులు అనుమతిచ్చారు. దీంతో శుక్రవారం నుంచి పర్యాటకుల సందడి మొదలైయింది. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య, పలుమార్లు రిసార్టు యజమానులతో చర్చలు జరిపి భద్రతా చర్యలు చేపట్టారు. దీనితో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులను బీచ్‌లకు అనుమతిచ్చారు. దీనికి ముందుగా బాపట్ల సూర్యలంక బీచ్‌కి అనుమతిచ్చిన ఎస్పీ, ఓడరేవు బీచ్‌లకు కూడా అనుమతి ఇవ్వడంతో పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకుగాను పర్యాటకుల రక్షణ, భద్రతా చర్యల్లో భాగంగా పలు చర్యలు చేపట్టారు. ఓడరేవు నుంచి కఠారివారిపాలెం వరకు ఏడు ప్రాంతాలను గుర్తించి అక్కడే స్నానాలు ఆచరించేందుకు అవకాశం కల్పించారు. ఈ ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. అలానే లైఫ్ జాకెట్‌లను అందుబాటులో ఉంచారు. సముద్రంలో లోతుగా వెళ్లకుండా ఎర్ర జెండాలను ఏర్పాటు చేసి ఆ పరిధిలోని స్నానాలు ఆచరించాలని పర్యాటకులకు చూచించారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి మెరైన్, చీరాల రూరల్ పోలీసులు, గజ ఈతగాళ్లను ఆయా ప్రాంతాల వద్ద సిద్ధగా ఉంచారు. దీనికి రెండు వారాల కిందట రామాపురం బీచ్‌లో రెండు రోజుల వ్యవధిలో తొమ్మిది మంది సముద్రంలో గల్లంతై మృత్యువాత పడ్డారు. దీంతో పోలీసులు, ఎమ్మెల్యే తాత్కాలికంగా బీచ్‌ను మూసి వేయాలని ఆదేశించారు. రెండు వారాల అనంతరం రిసార్టు యజమానులు తమ సొంత ఖర్చులతో భద్రతా చర్యలు చేపట్టడానికి ముందుకు రావడంతో ఎట్టకేలకు ఓడరేవు, రామాపురం, కఠారిపాలెం బీచ్‌లకు పర్యాటకులు రావడానికి అనుమతించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ పర్యాటకులు నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి సముద్రం వద్దకు వెళ్తే డ్రక్ అండ్ డ్రైవ్ కేసులు పెడతామని హెచ్చరించారు. సముద్రంలో నిర్దేశించిన ప్రాంతాల మేరకు పర్యాటకులు స్నానాలు ఆచరించాలని తెలిపారు. పూర్తిగా పోలీసు బందోబస్తు ఉంటుందని, ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు చేపడతామని ఎస్సై పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీల్లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ


సీట్లు సాధించిన విద్యార్థులతో చందలూరు హైస్కూల్ ఉపాధ్యాయులు


లావణ్యను సత్కరిస్తున్న కేజీబీవీ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు


అంజలి కుమారి, పూల నాగప్రణతి, ఆర్ఎస్ మహేష్, పరకాల సాత్విక, భవనం శివాని, సయ్యద్ నజ్మా


షేక్ మెహతాజ్, సీహెచ్ భార్గవి, ఎం పూజిత, సీహెచ్ సరస్వతి, కే శిరీషా, సీహెచ్ అరవింద్


కే ఉజ్వల, డీ కీర్తి, ఎం శ్రావ్య

కారంచేడు: ప్రభుత్వం ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో చెరుకూరు నేరెళ్ల సుబ్బయ్య జిల్లా పరిషత్ ఉన్నత్ పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. ఒకే పాఠశాల నుంచి ఏకంగా 10 మంది పదో తరగతిలో మంచి మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీ కాలేజీల్లో సీట్లు సాధించి గ్రామస్తులు, తల్లిదండ్రులు, ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ, పాఠశాల హెచ్ఎం బెంజిమెన్ హానోక్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందనలు తెలిపారు. పాఠశాలకు చెందిన సయ్యద్ నజ్మా, ఎస్‌కే మెహతాజ్, సీహెచ్ భార్గవి నూజివీడు ఐఐటీ క్యాంపస్‌లోను, ఎం పూజిత, సీహెచ్ సరస్వతి, కే శిరీషా, కే ఉజ్వల, డీ కీర్తి, ఎం శ్రావ్య ఒంగోలు క్యాంపస్‌కి, సీహెచ్ అరవింద్ శ్రీకాకుళం క్యాంపస్‌కి ఎంపికయ్యారు. అలాగే పాఠశాలకు చెందిన వై పూజిత, ఎస్‌కే షాహుల్‌లు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని హెచ్ఎం తెలిపారు.

జే.పంగులూరులో..

జే.పంగులూరు: మండల పరిధిలో మూడు పాఠశాలలకుగాను ట్రిపుల్ ఐటీ సీట్లు వచ్చాయి. వాటిలో చందలూరు పాఠశాలలో గొట్టిపాటి చంద్రిక, భూమా శ్రీలిఖిత, చందలూరు హారిక, బుద్దిగం రూపశ్రీ, కోమటి హేమశ్రీలు ఒంగోలు క్యాంపస్‌కు, పంగులూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు నాగ ప్రణితకు నూజివీడు, సాంబశివ మహేష్‌కు ఒంగోలులో సీట్లు వచ్చాయి. బూదవాడ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన మరపాల సాత్విక నూజివీడులో, భవనం శివానీలు ఒంగోలు క్యాంపస్‌లో సీట్లు సాధించారు. వీరిని ఆయా పాఠశాల హెచ్ఎంలు బంగారకొండ, చందలూరు గిరిజ, కొప్పోలు రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రిపుల్‌ఐటీల్లో సీట్లు సాధించడం అభినందనీయం..

బల్లికురవ: ప్రభుత్వ పాఠశాలలో చదివి మండల స్థాయిలో ప్రతిభతో ప్రథమ స్థానంలో నిలిచి ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించటం అభినందనీయమని ఎంఈవో1, 2లు ఎంసీహెచ్ వస్తం నాయక్, కె. రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం బల్లికురవలోని కేజీబీవీ విద్యార్థిని గోరంట్ల లక్ష్మీలావణ్య నూజివీడులో ట్రిపుల్ ఐటీలో సీటు కౌవసం చేసుకుంది. ఈసందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపల్ కోనా సరళకుమారి, ఉపాధ్యాయులు సత్కరించారు. కొణిదెనలోని యజ్ఞనారాయణ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జంద్రా అంజలి కుమారి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినందుకు హెచ్ఎం కెబీ. వెంకటేశ్వరరావు, పీఎంసీ చైర్మన్ టీ. రామాంజనేయులు ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

బల్లికురవ: గ్రామాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధులైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు చేపట్టవచ్చని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో శాఖల వారీగా సమీక్షించారు. ఎంపీడీవో వై హనుమారెడ్డి మాట్లాడుతూ వర్షాల సీజన్ ఆరంభమైనందున సర్పంచ్‌లు సెక్రటరీలు పారిశుధ్య కార్యక్రమాలను 3 నెలల పాటు స్పెషల్‌డ్రైవ్‌గా చేపట్టాలన్నారు. అప్పుడే సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు ఆరోగ్యవంతులుగా జీవించవచ్చన్నారు. వ్యవసాయాధికారిణి ఎస్‌వీపి కుమారి మాట్లాడుతూ ఖరీఫ్‌లో మండలంలో వర్షపాతం తక్కువగా ఉందని ఈ వర్షాలకు దుక్కులు దున్నో కోగిలిగారే తప్ప పంటల సాగు చేపట్టలేకపోయారన్నారు. ఎంఈవో ఎంసీహెచ్ వస్తం నాయక్ మాట్లాడుతూ 58 పాఠశాలలో 139 మంది ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉండగా 9 ఖాళీలు ఉన్నాయని సీబీఎస్‌ఈ సిలబస్‌తో విద్యార్థులను తీర్చి దిద్దుతున్నట్లు చెప్పారు. విద్యుత్‌శాఖ ఏఈ పీ. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో లో ఓల్టేజి శిథిలావస్థ పోల్స్ కిందకు జారిన సప్లయ్ వైర్లను సరిచేస్తున్నట్లు చెప్పారు. ముక్తేశ్వరం మల్లాయపాలెం గ్రామాలకు 33/11 కెవీ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని దాతలు స్థలాలను కేటాయిస్తే నిర్మాణ పనులు చేపట్టవచ్చన్నారు. పంచాయితీ రాజ్ ఏఈ జీ. హనుమంతరావు మాట్లాడుతూ గ్రామాలోని అసంపూర్తి సీసీ రోడ్లు కొత్తూరు–జమ్ముల మడక , చెన్నుపల్లి–వైదన, ఉప్పుమాగులూరు–కొణిదెన లింకురోడ్ల అభివృద్ధి ప్రతిపాదనలు తయారు చేసి పంపినట్లు వివరించారు. సమావేశంలో డీటీ రవికుమార్, ఏఈ దుర్గా రమేష్ , వైద్యాధికారులు, పి.మహేశ్వరరావు, జీ. రవితేజ, ఐసీడీఎస్ సీడీపీవో సుధ, ఈవోఆర్డీ సుమతి, ఉద్యానవన శాఖాధికారి బీ. హనుమంతనాయక్ మండల ఉపాధ్యక్షులు ఐవీ సుబ్బారెడ్డి, కోఆప్షన్ సభ్యులు షేక్ శ్రీనువలి పాల్గొని మాట్లాడారు.

వృద్ధుడు అదృశ్యంపై కేసు నమోదు


జలరాం (ఫైల్)

కొత్తపట్నం: వృద్ధుడు అదృశ్యం కావడంతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపట్నం మండలం మడనూరు గ్రామానికి చెందిన బిల్లా జలరాం (75) ఈ నెల 10వ తేదీ ఇంటి నుంచి ఈతముక్కలవైపు నడుచుకుంటూ వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. భార్య శీనమ్మ కూలి పనులకు వెళ్లి సాయంత్రానికి ఇంటికి వచ్చే సరికి భర్త కనిపించలేదు. రాత్రంతా వేచి చూసింది. బంధువులకు ఫోన్ చేసి అడిగింది. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌లో శీనమ్మ ఫిర్యాదు ఇచ్చింది. ఆ మేరకు రైటర్ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, ఆషాఢ మాసం, హస్త నక్షత్రం, సప్తమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈసందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

విద్యార్థుల భవిష్యత్ కోసమే మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సిబ్బంది

కొత్తపట్నం: పేద కుటుంబాల విద్యార్థుల భవిష్యత్ బాగుపడటం కోసమే వారికి సేవలు అందించడంతో పాటు ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అడపాల అయ్యప్ప అన్నారు. కొత్తపట్నం డీటీ కాలనీలో లయన్స్ క్లబ్ లెజెండనరీ సిటిజన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీపీ స్కూల్లో చదువుతున్న ఎస్టీ విద్యార్థులు, తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాట్లాడుతూ పేదరికంతో ఉన్న విద్యార్థులను లయన్స్ క్లబ్ ఆదుకుంటుందన్నారు. డీటీ కాలనీలో అందరూ ఎస్టీలేనని, వారి పిల్లలకు కనీసం పుస్తకాలు, పెన్నులు, పలకలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందని అన్నారు. ఆ విషయం తెలుసుకుని వారికి వాటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మొత్తం రూ.17 వేల విలువ చేసే నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, చార్ట్‌లు, బకెట్స్, కూలింగ్ వాటర్ క్యాన్‌లు, ప్యాడ్‌లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–1 తులసికుమారి, ఎంఈవో–2 పద్మావతి, కొత్తపట్నం హైస్కూల్ హెచ్ఎం ఎం.శ్రీదేవి, సెక్రటరీ సోమయ్య, లేజర్ చైర్మన్ శ్రీనివాస్, జోన్ చైర్మన్ రామకృష్ణ, క్లబ్ ఫ్లండర్ నరసింహారావు, హెచ్ఎం శ్రీనివాసరావు, వెంకట్రావు, లక్ష్మణ్, క్లబ్ సభ్యులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు బంకా కొండయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారంచేడు: మండలంలోని కారంచేడు, స్వర్ణ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లోను, పర్చూరు, ఇంకొల్లు మండల పరిధిలోని గ్రామాల్లోను శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్‌శాఖ డిప్యూటీ ఈఈ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. వినియోగదారులు అంతరాయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

చినగంజాం (పర్చూరు): విద్యుత్ కేంద్రాల్లో మరమ్మత్తుల నిమిత్తం నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ రమేష్ తెలిపారు. పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు మండలాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారుల అందరూ సహకరించాలని కోరారు.

వేటపాలెం: కొత్తపేటలో 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రూరల్ ఏఈ భాస్కరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంపత్ నగర్, కొత్తపేట, ఐఎల్‌టీడీ కాలనీ, వడ్డెర సంఘం, పాపాయిపాలెం, వాకావారిపాలెం, రోశయ్య కాలనీ, రామాపురం, ఓడరేవు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

- విద్యుత్ శాఖ ఈఈ జాన్‌థామస్


మాట్లాడుతున్న ఈఈ జాన్ థామస్

వేటపాలెం: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నిరంతర సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె జాన్‌థామస్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో చీరాల డివిజన్ పరిధిలోని విద్యుత్ సిబ్బందితో ఈఈ విద్యుత్ అంతరాయాలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఈఈ మాట్లాడుతూ 33 కేవీ, 11 కేవీ లైన్లు విద్యుత్ నియంత్రికలు మొదలైన వాటిని క్రమం తప్పకుండా సంరక్షణ చేసుకుంటూ విద్యుత్‌కి అంతరాయం తగ్గించాలని ఆదేశించారు. ఒకవేళ సరఫరాకు అంతరాయం కలిగితే ముందుగా సంబంధిత వినియోగదారులకు తెలియజేయాలన్నారు. సాంకేతిక కారణాల వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పతే వెంటనే సిబ్బంది స్పందించి అతి తక్కువ సమయంలో పునరుద్ధరించాలని ఆయన ఆదేశించారు. సిబ్బంది వినియోగదారులతో సంబంధాలు కొనసాగించి వారికి మెరుగైన సేవ చేయాలని కోరారు. సమావేశంలో చీరాల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి శ్రీనివాసరావు, వేటపాలెం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జై శ్రీనివాసులు, పర్చూరు డీఈ ఎన్ రమేష్‌బాబు, డివిజన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు


పేరాలలో కందిపప్పు స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణ

వేటపాలెం: స్థానిక పేరాల చిన్నరథం సెంటర్ వద్ద తక్కువ ధరకే బియ్యం–కందిపప్పు స్టాల్‌ను ఆర్డీవో సూర్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈ కేంద్రంలో తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. బియ్యం కిలో రూ. 49, ముడిబియ్యం కిలో రూ.48, దేశవాళి కందిపప్పు కిలో రూ. 160 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైస్, దాల్ మిల్లర్ అసోసియేషన్లు లాభాల్లో కొంత తగ్గించుకుని తక్కువ ధరకు బియ్యం కందిపప్పు ఇవ్వటం అభినందనీయమన్నారు. ఎవరైనా సరే ఆధార్ కార్డు చూపించి బియ్యం, కందిపప్పు కొనుగోలు చేయవచ్చన్నారు. ఎక్కడైనా అక్రమ నిల్వలు కృత్రిమ కొరత సృష్టిస్తే ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల బీసీ సెల్ అధ్యక్షుడు కొతరపు జనార్దన్, పట్టణ అధ్యక్షుడు గజ్జవల్లి శ్రీనివాసరావు, జీ చంద్రమౌళి, లావేటి శ్రీనివాస్, తేజ మొహిద్దిన్, టీ నాగేశ్వరావు పాల్గొన్నారు.


కందిపప్పును అందిస్తున్న నేతలు, అధికారులు

అద్దంకి: బియ్యం, పప్పుల అధిక ధరల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో బియ్యం కందిపప్పు కౌంటర్‌ను ప్రారంభించినట్లు గోడౌన్ డీటీ లక్ష్మీ వాసుదేవరావు చెప్పారు. పట్టణంలోని మండపానికి సమీపంలో శుక్రవారం సివిల్ సప్లయర్స్ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్, దాల్ మిల్లర్స్ అసోసియేషన్ సహాకరంతో ఒక కౌంటర్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమానికి తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై వినియోగదారులకు రూ.160 కందిపప్పు, కిలో రూ.49 బియ్యం అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కోట శ్రీనివాసరావు, రావి శ్రీనివాసరావు, మోదడుగు వెంకటేశ్వర్లు, శిఖాకొల్లి మల్లికార్జునరావు, జవ్వాజి ఏడుకొండలరావు, స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ

చీరాల రూరల్: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాలపై న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కోర్టు భవన సముదాయంలోని బార్ అసోసియేషన్ హాలులో అధ్యక్షుడు జి. రమేష్‌బాబు అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్. రెహానాలు పాల్గొని మాట్లాడారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలానే కొత్త చట్టాల ప్రకారం ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ద్వి చక్రవాహనదారులు ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. అలానే అతివేగంగా వాహనాలను నడిపి ప్రమాదాలకు గురికావద్దని చెప్పారు. అటువంటి నేరాలకు కొత్త చట్టాలలో శిక్షలు అధికంగా ఉన్నాయని చెప్పారు. అంతేకాక చిన్న పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వద్దని చెప్పారు. సదస్సులో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీనివాసరావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు సూర్యశ్రీ ట్రస్ట్ చేయూత

ఒంగోలు సెంట్రల్: సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓ వ్యక్తి వైద్య ఖర్చులకు శుక్రవారం ఆర్థిక చేయూత అందించారు. విజయవాడకు చెందిన విప్పర్ల రంగారావు గుండె జబ్బుతో బాధపడుతుండగా, ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్‌బాషా ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ ప్రవీణ్ సహకారంతో రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో రంగారావు కుమారుడు సుమేంద్రకు చెక్కు అందించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.